
www.prajasakti.com
ప్రజాశక్తి
5
ఆదివారం 3 మార్చి 2024
తిరుపతి



శ్రీవారి హుండీ ఆదాయం రూ.112కోట్లు



ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో శనివారం నిర్వహించిన టిటిడి డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఈవో ఏవీ ధర్మారెడ్డి మాట్లాడారు. ఫిబ్రవరి నెలలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య, విక్రయించిన శ్రీవారి లడ్డూ ప్రసాదం, అన్నప్రసాదం, కల్యాణకట్ట, హుండీ ఆదాయం తదితర వివరాలను తెలిపారు. ఫిబ్రవరి నెలలో 10.06 లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, 95.43లక్షల లడ్డూలను విక్రయించినట్లు తెలిపారు. అలాగే 43.61లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని, 6.56 లక్షల మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించినట్లు వివరించారు. కాగా ఫిబ్రవరి నెలలో తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.111.71కోట్లు వచ్చినట్లు తెలిపారు.

మళ్లీ ధర పెరిగిన ఉల్లి

- కూరగాయల ధరలకు రెక్కలు
- రోజురోజుకి పైపైకీ...
- పెళ్లిళ్లు, ఫంక్షన్ల పై ప్రభావం



ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

ఉల్లిపాయల ధరలకు మళ్లీ రెక్కలొస్తున్నాయి. నిన్నమొన్నటి వరకూ ఉల్లి ధరలు కాస్త తగ్గినట్టు కనిపించినా.. అది ఎంతోకాలం నిలవలేదు. మహారాష్ట్ర నుంచి కొత్త ఉల్లిపాయలు ఒకేసారి మార్కెట్లను ముంచెత్తడం, వివిధ రకాల నాణ్యతలు కలిగిన ఉల్లిపాయలు అందుబాటులోకి రావడంతో సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు తమకు నచ్చిన క్వాలిటీని ఎంపిక చేసుకునేవారు. ఆటోల్లో ఇళ్ల దగ్గరకు తెచ్చి మరీ ఏడు కిలోలు రూ.100కు కూడా విక్రయించారు. ఇక రైతు బజార్లు, బహిరంగ చిల్లర మార్కెట్లలోనూ ధర కాస్త తక్కువగానే ఉండేది. కానీ ఇప్పుడు సీన్ మారుతోంది.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులపై తాత్కాలికంగా నిషేధం ఎత్తివేయడంతో మహారాష్ట్ర నుంచి ఇతర దేశాలకు భారీగా ఎగుమతులు వెళ్లిపోతున్నాయి. ఫలితంగా దేశీయ మార్కెట్లోకి ఉల్లిలోడులు తక్కువగా వస్తున్నాయని, డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో కొరత ఏర్పడి ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోందని ఇక్కడి వ్యాపారులు చెబుతున్నారు. మరోపక్క కూరగాయల ధరల్లోనూ పెరుగుతూనే ఉన్నాయి. మాఘమాసంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు పెద్దసంఖ్యలో జరుగుతుండడంతో కూరగాయల వినియోగం భారీగా పెరిగింది. దీంతో వ్యాపారులు ధరలు పెంచేశారు. అలాగే ఉష్ణోగ్రతల్లో వస్తున్న మార్పుల ప్రభావం కూరగాయల దిగుబడులపై పడుతోంది. దీంతో కూరగాయల ధరల్లో కొంత పెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా గతవారం రోజులుగా ధరల్లో పెరుగుదల కనిపిస్తోంది.

హోల్ సేల్ మార్కెట్లో మంచి నాణ్యత కల్గిన ఉల్లిపాయలు కిలో రూ.26 నుంచి రూ.28 ధర ఉంది. ఇదే రకాన్ని బహిరంగ మార్కెట్లో రిటైల్ వ్యాపారులు రూ.30 నుంచి రూ.35ల వరకూ విక్రయిస్తున్నారు. రైతు బజార్లలో మొన్నటివరకూ కిలో రూ.20లు ఉండగా ఇప్పుడు రూ.24లకు చేరింది. ఆటోల్లో ఇళ్ల దగ్గరకే తెచ్చి విక్రయించేవారు కూడా (చిన్న ఉల్లిపాయలు) రూ.100లకు ఐదు కిలోలు మించి ఇవ్వడం లేదు. క్వాలిటీ తక్కువగా ఉండే రకాలు మార్కెట్లోకి రాకపోవడం, మంచి రకాలు, నిల్వలు ఎక్కువ రేటులో ఉండడంతో వీధుల్లో విక్రయించే చిల్లర వ్యాపారులు ఉల్లిపాయల జోలికి వెళ్లడం లేదు.

కూరగాయలదీ అదే దారి...

ఉల్లిపాయల బాటలోనే కూరగాయల ధరల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. ఒక్క టమోటా మినహా మిగిలిన అన్ని రకాల కూరగాయల ధరలు పెరిగాయి. బహిరంగ చిల్లర మార్కెట్లో వంకాయలు కిలో రూ.80 వరకూ అమ్ముతున్నారు. బెండకాయలు రూ.50, పచ్చిమిర్చి రూ.60, కాకరకాయలు రూ.50, బీరకాయలు రూ.40, చిక్కుళ్లు రూ.80 వరకూ అమ్ముతున్నారు. రైతుబజార్లలో ధరలు పరిశీలిస్తే వంకాయలు కిలో రూ.54, గులాబీ రకం రూ.44, తెలుపు రూ.38 ఉంది. రెండు వారాల వ్యవధిలోనే కిలోకు రూ.10 నుంచి రూ.15 వరకూ ధరలు పెరిగాయి. కాలీఫ్లవర్ రూ.25లకు విక్రయిస్తున్నారు. ఇది రూ.12 నుంచి 15లకు దొరికేది. బెండకాయలు రూ.32, పచ్చిమిర్చి రూ.34, కాకరకాయలు రూ.38, చిక్కుళ్లు రూ.54, చేమదుంపలు రూ.50, బీన్స్ రూ.60, సొరకాయ రూ.16.. ఇలా అన్ని రకాల కూరగాయల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. రైతుబజార్లతో పోల్చితే బహిరంగ మార్కెట్లలో ధరలు మరింత ఎక్కువగానే ఉంటాయి.



ధరలు మరింత పెరిగే అవకాశం...

తిరుపతి ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌కు తమిళనాడు, కర్ణాటక, కర్నూలు, ఒంగోలు నుంచి కూరగాయల లారీలు రోజుకి 30పైగా వస్తాయి. రాబోయే రోజుల్లో ఉల్లిపాయలు, కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇతర దేశాలకు ఉల్లి ఎగుమతులపై మళ్లీ నిషేధం విధించినా ఉల్లిపాయల ధరలు ఇప్పట్లో తగ్గకపోవచ్చనే అంచనా వేస్తున్నారు. ఉల్లిపాయలు పాతబడితే వాటి నాణ్యత పెరుగుతుంది. నిల్వకు ఆగుతాయి. ఇలాంటి రకాలన్నీ కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేస్తారు. మంచి రేటు వచ్చాక బయటకు తీస్తారు. ఎగుమతులపై నిషేధం లేకపోతే క్వాలిటీ ఉల్లిపాయలను మంచిరేటుకు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తారని, దేశీయ మార్కెట్లో కొరత ఏర్పడి ధరలు పెరుగుతాయని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. అలాగే, రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే ఆ ప్రభావం కూరగాయల సాగుపై పడుతుంది. దిగుబడులు లేకపోతే ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను తీసుకురావాల్సి ఉంటుంది. ఫలితంగా ధరలు మరింత పెరుగుతాయని కూరగాయల వ్యాపారులు అంటున్నారు. అటు ఉల్లిపాయలు ఇటు కూరగాయలు పెరుగుదల సామాన్యులపై ప్రభావం పడనుంది.

శివరాత్రి ఉత్సవాలకు వేళాయే..

నేటి నుంచి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం





ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ఈనెల 3వ తేదీ ఆదివారం నుంచి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 3న భక్తకన్నప్ప ధ్వజారోహణం, 4న శ్రీకాళహస్తీశ్వరస్వామి ధ్వజారోహణం, 5న 2వ తిరునాళ్లు, 6న మూడవ తిరునాళ్లు, 7న నాలుగవ తిరునాళ్లు, 8న మహాశివరాత్రి, 9న ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 10న ఆదిదంపతుల కల్యాణం, 11న సభాపతి కల్యాణం, 12న కైలాసగిరి ప్రదక్షిణ, 13న ధ్వజావరోహణం, 14న పల్లకీసేవ, 15న ఏకాంతసేవ, 16న శాంతి అభిషేకం నిర్వహించనున్నారు. ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేశారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండటానికి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఇప్పటికే తిరుపతి కలెక్టరు డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం రాజగోపురం వెనుక వైపున కళాప్రాంగణం సిద్ధమైంది. స్వామి అమ్మవార్ల సేవలకు ఆలయ అధికారులు వాహనాలు సిద్ధం చేశారు.

ప్రధాన అర్చకులకు బంగారు ఆభరణాలు అప్పగింత

శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి అలంకరించడానికి అవసరమైన బంగారు ఆభరణాలను శనివారం ఆలయ ప్రధాన అర్చకులకు అప్పగించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ బ్యాంకులోని లాకర్లలో ఉంచిన ఆ బంగారు ఆభరణాలను అధికారులు పరిశీలించి ప్రధాన అర్చకులకు అందజేశారు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు ఈ ఆభరణాలను స్వామిఅమ్మవార్లకు అలంకరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్వీ నాగేశ్వరావు, సహాయ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, పర్యవేక్షకులు కళ్యాణి, అకౌంటెంట్ యుగంధర్, అప్రైజర్ రవిచంద్ర, అలంకార గురుకుల్ రాజేష్, సూరి పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూ ధర తగ్గించలేం..

డయల్ యువర్ ఈవో ఏవి.ధర్మారెడ్డి



ప్రజాశక్తి- తిరుమల: యువకులైన శ్రీవారి సేవకులు క్యూలైన్లు, శ్రీవారి ఆలయంలో భక్తులకు సేవలందించేందుకు ముందుకు రావాలని టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టీటీడీ చేపట్టిన అనేక కార్యక్రమాలతో పాటు ధార్మిక, ఎస్వీబిసి కార్యక్రమాలు బాగున్నాయని భక్తులు ప్రశంసల వర్షం కురిపించారు. తిరుమల అన్నమయ్య భవనంలో డయల్ యువర్ ఈవో కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు భక్తులు అడిగిన ప్రశ్నలకు ఈవో సమాధానాలు ఇచ్చారు. శ్రీవారి సేవకుల వయస్సు 60 సంవత్సరాల పుండి 65 సంవత్సరాలు చేయండని ఓ భక్తుడు అడుగగా.. ఈవో మాట్లాడుతూ ప్రతిరోజు వేలాది మంది భక్తులు తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తుంటారు, వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సేవలందించడానికి 60 సంవత్సరాలలోపు వారైతే బాగా సేవలందిస్తారని తెలిపారు. అలాగే శ్రీవారి లడ్డూ ప్రసాదాలు రెండే ఇస్తున్నారు. ప్రతి భక్తుడికి 10 ఇచ్చేలా చర్యలు తీసుకొండని అడుగగా.. శ్రీవారిని దర్శించుకున్న ప్రతి భక్తుడికి ఒక ఉచిత లడ్డూ అందిస్తున్నామని, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి తదితర పర్వదినాల్లో తప్ప, మిగిలిన సమయంలో భక్తులు కావాలసినన్ని లడ్డూలు పొందవచ్చు అని తెలిపారు. శ్రీవారి లడ్డూ పరిమాణం తగ్గింది. రేటు తగ్గించండండి అని అడుగగా.. లడ్డూ బరువు, పరిమాణం తగ్గలేదు, రేటు తగ్గించడానికి అవకాశం లేదని తెలిపారు. శ్రీవారిని దగ్గరగా చూసే అవకాశం కల్పించండని మరో భక్తుడు కోరగా విఐపి సిఫారస్సు లేటర్లు, శ్రీవాణి ట్రస్టు ద్వారా టికెట్లు కొనుగోలు చేసి బ్రేక్ దర్శనం పొందవచ్చు అని తెలిపారు. సేవా, దర్శనం టికెట్లతో పాటు వసతి బుక్ చేసుకునే అవకాశం కల్పించాలని కోరగా.. ఏప్రిల్ 1వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ ద్వారా దర్శనం, సేవా టికెట్లు పొందిన భక్తులకు వసతి అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. తిరుపతి నుంచి తిరుమలకు బస్సులను నామమాత్రపు ధరలకు టీటీడీ నడపాలని ఓ భక్తుడు కోరగా టీటీడీకి సాధ్యం కాదని ఈవో తెలిపారు. భక్తులు తిరుమలకు ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ళు తీసుకువస్తున్నారని, అలిపిరి వద్ద చెకింగ్ సరిగ్గా జరగడం లేదని భక్తుడు ఫిర్యాదు చేయగా దానిపై చర్యలు తీసుకుంటామి ఈవో తెలిపారు.

బోరు వేయకుండా అడ్డగింత

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: పేదల దాహార్తి తీర్చడానికి తెలుగుదేశం నేతలు తాగునీటి బోరు వేయిస్తుండగా శ్రీకాళహస్తీశ్వర ఆలయ అధికారులు అడ్డుకున్న సంఘటన శనివారం శ్రీకాళహస్తి మండలం వేడాం గిరిజన కాలనీలో జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. వేడాం గిరిజన కాలనీలో చాలా కాలంగా తాగునీటి సమస్య ఉంది. గిరిజనులు తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య గురించి స్థానిక గిరిజనులు ఇటీవల తెలుగుదేశం పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి తెలియచేశారు. దీంతో ఆయన తాగునీటి సమస్య తీర్చాలనుకున్నారు. ఇందులో భాగంగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బందమ్మ వేడాం గిరిజనకాలనీ వద్దకు వెళ్లి తమ సొంత సొమ్ముతో బోరు వేయించడానికి కొబ్బరికాయ కొట్టారు. ఆ తరువాత బోరు వేస్తుండగా అధికార పార్టీ నేతలు ముక్కంటి ఆలయ అధికారులను పంపి అడ్డుకున్నారు. ఈ విషయమై టీడీపీ నేతలు మాట్లాడుతూ... ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆలయ అధికారులను పంపి బోరు వేయరాదని అని చెప్పి అడ్డుకకోవడం బాధాకరమన్నారు. ప్రజలు ఇది గమనించాలని వారు కోరారు.

80 మంది నూతన పోలీసులకు శిక్షణ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: నూతన చట్టాలపై పోలీసులకు తిరుపతి కళ్యాణ డ్యాం పిటిసిలో శిక్షణ అందించారు. ఇప్పటికే తొమ్మిది జిల్లాలకు చెందిన 80 మంది 2 బ్యాచుల అధికారులకు వారం రోజుల పాటు శిక్షణ కార్యక్రమం పూర్తి అయ్యింది. ఎన్నికల ప్రక్రియలో పోలీసు అధికారులు సిబ్బంది నిమగ్నం అవడంతో శిక్షణ కార్యక్రమాన్ని ఆన్లైన్ ద్వారా నిర్వహించారు. మొదటి విడతగా ఫిబ్రవరి 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు ఆరు రోజులపాటు 'జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో వర్చువల్ తరగతుల' ద్వారా కళ్యాణీ డ్యాం అధికారులు బోధించారు. ఆరు జిల్లాల నుండి సుమారు 2,900 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది తరగతులకు హాజరై శిక్షణ పొందారు. రాష్ట్ర డిజిపి కెవి.రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ట్రైనింగ్ ఐజి వెంకటరామిరెడ్డి, పర్యవేక్షణలో తిరుపతి జిల్లా ఎస్పీ మలిక గర్గ్ సహకారంతో కళ్యాణి డాం పిటిసి ప్రిన్సిపల్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వవారు నూతనంగా తీసుకువచ్చిన మూడు కొత్త చట్టాలు, భారతీయ న్యాయ సంహిత, నాగరిక సురక్ష సంహిత, సాక్ష్య అధినీయంలపై ఇప్పటికే తొమ్మిది జిల్లాలకు చెందిన 80మంది రెండు బ్యాచ్‌ల పోలీస్ అధికారులకు నేరుగా శిక్షణ ఇచ్చారు. వీరికి పిటిసి ప్రిన్సిపల్ ఎం.కే.రాధాకృష్ణ ధన్యవాదాలు తెలియజేశారు.

పేదలపై ప్రతాపం

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: వైసిపి పాలనలో పేదలపై, కర్షకులు, కార్మికులు, మహిళలపై అధికార ప్రతాపం మితిమీరి పోయింది. దోపిడికి కాదేది అనర్హం అనే రీతిలో వ్యవహరిస్తూ అధికారులు, పోలీసులు అండతోనే అధికార పార్టీ నాయకులు ఇసుక, మట్టి, గంజాయి, ఎర్రచందనం, అక్రమ మద్యం తరలింపులకు పాల్పుడుతూ, ఇది చాలదన్నట్లు భూముల కబ్జాలకు కూడా పాల్పడుతున్నారు. ప్రభుత్వ భూములే కాదు సుమా, అండబలం, అధికార బలం, ఆర్థిక బలంతో ప్రైవేట్ స్థలాల్లో కూడా అడుగేసి, అంతా మాదే అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. వీరిని కనీసం ప్రశ్నించని, రెవెన్యూ, జిల్లా అధికారులు, పోలీసులు పేదలు నిలువ నీడ కోసం కబ్జాదారులు అక్రమంగా ఆక్రమించిన ప్రభుత్వ భూములను తమకు అప్పగించాలని అడిగితే లాఠీదెబ్బలు, అక్రమకేసులు తప్పడం లేదు. ఇటీవల చోటు చేసుకున్న కొన్ని సంఘటనలే అందుకు నిదర్శనాలు.

ఆహర్నిశలు కష్టపడి, రెక్కాడితేకాని డొక్కాడనివి పేదల బతుకులు. రోజంత కష్టించిన చాలీచాలని కూలీలు, దాంతో కుటుంబాలను పస్తులతో లేకుండా పోషించుకోవడమే కష్టం. పైగా అద్దె ఇంటికి బాడుగు, విద్యుత్ బిల్లులు, డ్రైనేజి బిల్లు, చెత్త బిల్లు, ఇతరాత్రవి చెల్లించాలి. ఇవన్ని చెల్లించే స్తోమత లేకుండా అల్లాడుతున్న పేదలు తమకు సెంట్ స్థలం కేటాయించి, ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరితే అది అక్రమం. ప్రభుత్వ భూములను చూపి, ఇక్కడే తమకు స్థలాలు ఇవ్వాలని కోరితే అది దిక్కారం. అదే వందల ఎకరాలు అధికార పార్టీ నాయకులు స్వాధీనం చేసుకుంటే అది సక్రమం, దానికి అధికారులు సైతం మద్దతు. పోలీసులు కాపలా. ఈ కోవలోవే ఇటీవల జరిగిన ఘటనలు... తిరుపతి అర్బన్, రూరల్ ప్రాంతంలోని పలువురు పేదలకు ప్రభుత్వం ఇంటిస్థలాలు ఇస్తామని ప్రకటించి, పట్టాలు సైతం ఇచ్చింది. కానీ ఇప్పటి వరకు స్థలాలు చూపలేదు. ఎక్కడో సుదీర ప్రాంతంలోని చిందేపల్లెలో ఇళ్లస్థలాలు చూపిస్తామని అధికారులు చెప్పారు. ఇది అన్యాయం దగ్గరగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని బాధితులు కోరారు. వారందరు ఎర్రజెండా (సిపిఎం) సహకారంతో ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలోని చెన్నాయగుంటల లెక్కదాఖలు సర్వేనెంబరు 195/2లో ఉన్న 41ఎకరాల ప్రభుత్వం స్థలాన్ని కొంత మంది కబ్జాకు పాల్పడుతున్నారని, ఇక్కడ తమకు స్థలాలు కేటాయించాలని కోరారు. పేదలందరు కలిసి అక్కడ ఎర్రజెండాలు నాటారు. అంతే అధికారపార్టీ నాయకులు కన్నుసైగతో పోలీసులు హుటాహుటీన అక్కడకు చేరుకుని, ముందస్తుగా సిపిఎం నాయకులను హౌస్ అరెస్టులు చేసి, పేదలపై లాఠీ ఝులిపించారు. మహిళలను సైతం మగ పోలీసులు ఈడ్చిపడేసి గోలగోల చేశారు. అడ్డొచ్చిన సిపిఎం నాయకులపై సైతం పోలీసులు దాడులు చేసి గాయపరిచారు.

కరకంబాడీలో మరీ బీభత్సం

బిటిఆర్ కాలనీ ఘటన మరుసటి రోజే కరకంబాడీ వద్ద గుట్టలో పేదల నిర్మించుకున్న గుడిసెలపై పోలీసులు విరుచకపడ్డారు. ప్రభుత్వానికి సంబంధించిన 150 ఎకరాలకుపైగా ఉన్న స్థలాన్ని అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి లీజు పేరుతో ఆక్రమించుకని, కొండలు, గుట్టలు తవ్వేసి, అక్రమంగా మైనింగ్ చేసి కోట్లాది రూపాయలను దోచుకుంటున్నా అధికారులు స్పందించలేదు. ఇది అక్రమం, అన్యాయం అని ప్రజలే ఎదురుతిరిగి, అదే ప్రాంతంలో ఎర్రజెండా (సిపిఎం) సహకారంతో గుడిసెలు వేసుకున్నారు. సుమారు నెల రోజుల పాటు ముళ్లు, చెట్లపొదల్లో చిన్నచిన్న గుడిసెల్లోనే కాపురం ఉంటున్న పేదలపై రాక్షసత్వాన్ని ప్రదర్శించారు పోలీసులు. అధికార పార్టీ ఆదేశాలతో, జిల్లా అధికారుల ప్రోద్బలంతో పోలీసులు వేకువజామున 3 గంటలకే ఆ ప్రాంతానికి చేరుకుని, ఉగ్రవాదులతో యుద్ధాన్ని తలపించే రీతిలో 600మంది పోలీసులు, ఫైర్ ఇంజన్లు, అంబులెన్సులు, జెసిబిలు, హిటాచీలతో పేదలపై ప్రతాపం చూపారు. కనిపించిన వారిని కనిపించినట్లు చావబాదారు. గుడిసెలను పీకేసి, సామాన్లను విసిరేసి అబ్బో అదో పెద్ద ప్రపంచ యుద్ధాన్నే తలపించారు. దీన్నిపై కనీసం బూర్జవ రాజకీయ పార్టీలు స్పందించన కూడా తెలపలేదు. అంటే వారి మద్దతు ఎవ్వరికో ఇట్టే అర్థమవుతోంది.

ఈ ఘటనకు రెండు రోజుల ముందు తిరుపతి రూరల్ కుంట్రపాకం వద్ద ప్రభుత్వస్థలంలో పేదలు సిపిఐ ఆధ్వర్యంలో గుడిసెలు నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తే పోలీసులు సహాయంతో వారందర్ని తరిమివేసి, స్థలం జోలికి వస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరికలు జారీచేసి, అక్రమ కేసులు బనాయించారు. ప్రభుత్వ భూములు సరే ప్రైవేట్ భూములను కూడా అధికారపార్టీ వారు వదలడం లేదు. తిరుచానూరు పంచాయతీలోని యోగమల్లవరంలో స్థానికుడైన పెరుమాళ్ ఏప్పుడు 30ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన ప్రయివేట్ స్థలంలోకి అధికార పార్టీకి చెందిన స్థానిక ఎంపిటిసి నకిలీ పత్రాలతో ప్రవేశించి, రాత్రికిరాత్రే భవన నిర్మాణాన్ని చేపట్టారు. ప్రశ్నించిన సొంతదారులపై మా ఇష్టం, నీకేదైన ఆధారాలు ఉంటే పోలీసులకు చెప్పకో అంటూ బెదిరించారు. పోలీసుల అండతోనే కబ్జాకు పాల్పడ్డాడు. బాధితులు విధిలేక సిపిఎంను ఆశ్రయించడంతో విషయం తెలుసుకున్న నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు అక్కడికి చేరుకుని పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. వారికి స్థానికులు కూడా మద్దతు ఇవ్వడంతో చేసేది లేక పోలీసులు సలహామేరకు తాత్కాలికంగా వెనక్కి తగ్గారు. కానీ మార్చి మొదటి వారంలో తిరిగి భవనాన్ని నిర్మించేందుకు అధికారులు సహకారాన్ని ముమ్మరం చేయనున్నారు. ఇలా ఎక్కడ చూసిన అధికార కబ్జాలు అధికమయ్యాయి. పేదలకు అడుగు స్థలం కూడా దొరకని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు, అధికారులు ఆలోచించి, నిజమైన అర్హులకు ప్రభుత్వస్థలంలో ఇళ్లస్థలాలను ఇచ్చి, కబ్జాదారుల నుంచి ఇటు ప్రభుత్వ భూములు కాపాడి, మరో పక్క పేదలకు ఇళ్లస్థలాలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.



కరకంబాడీలో పేదల గుడిసెలు కూల్చిన దృశ్యం (ఫైల్‌ఫొటో)

తిరుమల్లో తెరుచుకున్న మహంతు నివాసం (డోలు)

శనివారం పంచనామా నిర్వహించిన అధికారులు
తాత్కాలిక మహంతుగా ఓంప్రకాష్ దాస్
పాల్గొన్న ఫిట్ పర్సన్ రమేష్ నాయుడు



ప్రజాశక్తి- తిరుమల: అనేక వివాదాల నడుమ రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం హథీరాంజీ మఠం తాత్కాలిక మహంతుగా ఓంప్రకాష్ దాస్ బాధ్యతలు చేపట్టారు. ఈనేపథ్యంలో తిరుమలలో శనివారం పోలీసులు, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులు, మఠం ఫిట్‌పర్సన్ రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయానికి సమీపంలో ఉన్న శ్రీ స్వామి హథీరాంజీ మఠంలో గల మహంతు అధికారిక నివాసం (డోలు)కు పంచనామా నిర్వహించి తాత్కాలిక మహంతుగా బాధ్యతలు స్వీకరించిన ఓం ప్రకాష్ దాస్ ప్రవేశించారు. గత ఏడాది జూన్ 8వ తేదీన మాజీ మహంతు అర్జున్ దాస్ ఎదుర్కొంటున్న అక్రమాల ఆరోపణలు వాస్తవం అని తేలడంతో ధార్మిక పరిషత్ అర్జున్ దాస్‌ను మహంతు పదవి నుండి తప్పించింది. ఈ నేపథ్యంలో అర్జున్ దాస్ మఠం విడచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అనంతరం ధార్మిక పరిషత్, రాష్ట్ర దేవాదాయశాఖ ఆదేశాల మేరకు హథీరాంజీ మఠంకు ఫిట్ పర్సన్‌గా రమేష్ నాయుడును ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు చేపట్టిన రమేష్ నాయుడు మఠంలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి పలు కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో అర్జున్ దాస్ బంధువులు అనధికారికంగా మఠంకు సంబంధించిన ఆస్తులను అనుభవిస్తున్నారని గుర్తించి నోటీసులు జారీచేసినా ఖాతరు చేయలేదని, దీంతో పోలీసుల సహాయంతో ఆయా ఆస్తులను పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకోవడం జరిగిందని మఠం ఫిట్‌పర్సన్ తెలిపారు. పంచనామా అనంతరం తాత్కాలిక మహంతు ఓం ప్రకాష్ దాస్‌కు అధికారిక నివాసంలో ఉన్న వస్తువులు, విలువైన సామాగ్రిని అప్పగించడం జరిగిందన్నారు. హథీరాంజీ మఠంకు సంబంధించిన భూములను స్వాధీనం చేసుకోవడంలో వేగం పెంచామని, పలు ప్రాంతాల్లో తమ సిబ్బందిపై దాడులకు దిగిన ఘటనలు జరిగాయన్నారు. ఏది ఏమైనా హథీరాంజీ మఠంకు సంబంధించిన భూములను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. ఈ పంచనామా కార్యక్రమంలో ల్యాండ్ ప్రొటెక్షన్ అధికారిని సత్యవతి, మఠం ఏఈఓ శ్రీనివాసరెడ్డి, మఠం సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులకు

ఈవిఎంల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహణ కొరకు చర్యలు చేపడుతున్నట్లు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ వివరించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో, ఈఆర్ఓలతో కలసి ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ–2024, తుది జాబితా అభ్యంతరాలపై, ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు 2024లో పాల్గొనే అభ్యర్థుల ఎన్నికల వ్యయం కొరకు ప్రత్యేక బ్యాంకు అకౌంట్, చెక్‌బుక్‌లను నామినేషన్ వేసే ముందు రోజు లోపు తప్పక కలిగి ఉండాలని తెలిపారు. జిల్లాలో 61 పోలింగ్ స్థానాల మార్పుకు, 80 పోలింగ్ కేంద్రాల పేరు విధానం మార్పు, ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలు 6 కొరకు చీఫ్ ఎలెక్టోరల్ అధికారి కార్యాలయంకు ఆమోదం కొరకు పంపడం జరుగుతుందని తెలిపారు. హోమ్ ఓటింగ్‌కు వయసు 85 సంవత్సరాలకు పైబడిన, పోలింగ్ కేంద్రాలకు రాలేని వారికి మాత్రమే ఈఅవకాశం ఉంటుందని తెలిపారు. గతంలో సీజర్ చేసిన డబ్బు తదితరాల వాటి వివరాలను ఒకే కామన్ యాప్ ఈఎస్ఎంఎస్ (ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టమ్) నందు సంబంధిత శాఖలు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈఎస్ఎంఎస్ అంశంపై, సి–విజిల్, ఈవిఎం వాడకంపై సంబంధిత నోడల్ అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. సి–విజిల్ యాప్ ఎవరైనా వారి మొబైల్‌లో ఇన్స్టాల్ చేసుకుని ఏదేని ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై టెక్స్ట్, దృశ్య, శ్రవణ విధానంలో కంప్లైంట్ చేయవచ్చని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రాజకీయపార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పెంచల కిషోర్, ఈఆర్ఓలు అదితి సింగ్, కిరణ్ కుమార్, రవిశంకర్ రెడ్డి, నిశాంత్ రెడ్డి, చంద్రముని, కోదండ రామిరెడ్డి, అదనపు ఎస్పీ రాజేంద్ర, ట్రైనింగ్ నోడల్ అధికారి రామ్మోహన్, ఎన్ఐసి అదనపు డిఐఓ వేంకటేశ్వర రావు, ఎస్డిసి ప్రవీణ్ కుమార్ రెడ్డి, సి విజిల్ నోడల్ అధికారి ప్రసాదరావు, రాజకీయపార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -నాగలాపురం: నాగలాపురం మండలంలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియోను విజయవంతం చేయాలని డాక్టర్ విజయకుమార్ పేర్కొన్నారు. మండలంలోని, బికే బెడు, సురుటుపల్లి, కృష్ణాపురం, గోపాలపురం, నాగలాపురం - ఎస్ఎస్పురం హరిజనవాడ, టీపీ పాలెం మార్గాలలో 38 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో 0–5 లోపు వయసున్న 3,597 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందన్నారు. ఈ పల్స్పోలియోను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేవిబి పురం: కేవిబి పురం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్ర ప్రాంగణంలో వైద్యాధికారి డాక్టర్ కటారి కుమార్ ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కుమార్ మాట్లాడుతూ ఆదివారం నిర్వహించే పల్స్ పోలియోకు 23 కేంద్రాలు ఏర్పాటు చేశారని మూడు రూట్లలో 110 మంది సిబ్బంది పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రేణిగుంట: పల్స్ పోలియోను విజయవంతం చేయాలని ఏణిగుంట మండలం వెద్దలచెరువు ఎస్టీ కాలనీలో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైసిపి నాయకుడు గిరి రెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్ర వర్ధిని, చంద్ర శేఖర్, ఏఎన్ఎం సంధ్య, అశా వర్కర్ లు ముని కుమారి, హంస, అరుణ, ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి,జయప్రకాష్ పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని ఎండి పుత్తూరు గ్రామపంచాయతీలో సర్పంచ్ మోహన్ ప్రియ ఆధ్వర్యంలో శనివారం పల్స్ పోలియో కార్యక్రమం పట్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పకుండా రెండు పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలనికోరారు.ఈకార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి లోకముని, సచివాలయం సిబ్బంది ఎంఎల్హెచ్పి దివ్య, ఏఎన్ఎం లలిత, ఆశ వర్కర్ సునీత, అంగన్వాడి టీచర్ విమల కుమారి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత పాల్గొన్నారు.

దేవాలయానికి విరాళం

ప్రజాశక్తి -కోట : కోట మండలం శ్యామసుందర పురంలో నూతనంగా నిర్మిస్తున్న అభయాంజనేయ స్వామి దేవాలయానికి టీడీపీ తిరుపతి పార్లమెంట్ బీసీ సెల్ సభ్యులు తీగల సురేష్ బాబు 5,116 రూపాయలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ కేషంసుద్దీన్, మోహన్, తల్లం శ్రీనివాసులు, పంత్రంగం కళ్యాణ్, సాయి పాల్గొన్నారు.

'వైయస్ఆర్ ఆసరా' చెక్కు పంపిణీ

ప్రజాశక్తి శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని స్థానిక యంపిడిఓ కార్యాలయం ఆవరణలో వైయస్ఆర్క్రాంతి పథం ఆధ్వర్యంలో 4వ విడత వైయస్ఆర్ ఆసరా పంపిణీ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలంలో 4వ విడత 1166 సంఘాలలో 10990 మంది సభ్యులు కు 10 కోట్ల 63 లక్షల జమ చేశారని తెలిపారు. అనంతరం ఈ సొమ్మును మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మిద్దెల హరి, వైసిపి మండల అధ్యక్షుడు ఉయ్యాల క్రిష్ణా రెడ్డి, యంపిడిఒ పఠాన్ రఫీ ఖాన్, ఏపియం మునెయ్య, సర్పంచ్లు, యంపిటిసిలు, సిసి లు, యంయస్ లీడర్లు, వివో లీడర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చట్టబద్ధంగా వ్యవహరించండి: జనసేన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజక వర్గంలోని పోలీసులు ప్రతిపక్షాల పట్ల చట్టబద్ధంగా వ్యవహరించేలా సూచించాలని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్ఛార్జి కోటా వినుత శ్రీకాళహస్తి డిఎస్పిని కోరారు. వినుత శనివారం శ్రీకాళహస్తి డిఎస్పి ఉమామహేశ్వర రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. జనసేన కార్యకర్తల పై పోలీసులు బలవంతపు బైండోవర్ కేసులు పెడుతున్నారని రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామంటూ బెదిరిస్తున్నారని వినుత తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోలీసుల నుండి జనసేన కార్యకర్తలకు ఇలాంటి వేధింపులు తగదని సూచించారు. పోలీసులు ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించేలా చూడాలని కోరారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు కొత్త చట్టాల పై పోలీసులు ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కళ్యాణి డ్యాం పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ అన్నారు. శనివారం పి టి సి లో నూతన చట్టాలపై శిక్షణ ముగింపు పూర్తయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో 3 నూతన చట్టాల పై శిక్షణ గత నెల రోజులుగా జరుగుతోందని ఇప్పటికే 9 జిల్లాలకు చెందిన రెండు బ్యాచుల అధికారులకు వారం రోజులపాటు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఆన్లైన శిక్షణ తరగతులను స్వేచ్ఛ నుండి 2900 మంది హాజరయ్యారని తెలిపారు.

జగన్మోహన్ రెడ్డి తోనే పేదల బతుకుల్లో వెలుగులు: వైసిపి

ప్రజాశక్తి- ఏర్పేడు : మండల కేంద్రమైన ఏర్పేడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయించిన ఇంటి పత్రాలను ఏర్పేడు గ్రామపంచాయతీ పరిధిలో 83 మందికి 60 మంది లబ్దిదారులకు సర్పంచ్ సంపం అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తోనే పేదల బతుకుల్లో వెలుగులు వచ్చాయని, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డితో అభివృద్ధి చెందిందని తెలిపారు. ఈ పట్టాలను ఇవ్వడం వల్ల తమకు కొండంత ధైర్యాన్ని ఇచ్చిందని శివయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో బాలాజీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివచంద్ర పాల్గొన్నారు.

ముగిసిన సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. డి. ఉమాదేవి నిర్వహించిన వారం రోజుల సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ముగిసింది. ఈ కార్యక్రమంలో డాక్టర్. డి. ఉమాదేవి మాట్లాడుతూ అమ్మాయిలకు ఆత్మరక్షణ విద్యలో శిక్షణ ఎంతో అవసరమని, స్వీయ రక్షణ మెలకువలను నేర్చుకున్నప్పుడే ఏ పరిస్థితులైన హ్యాండిల్ చేయగలమని, ఆత్మరక్షణ శిక్షణతో ఆత్మవిశ్వాసం పెంపొందించుకొని అమ్మాయిలు రాటుదేలుతారన్నారు. సెల్ఫ్ డిఫెన్స్ పైన శిక్షణ విచ్చేసిన ధనుంజయులు విద్యార్థులకు వారం రోజులపాటు కొన్ని ముఖ్యమైన టెక్నిక్ లను నేర్పించి ప్రాక్టీస్ చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర డైరెక్టర్ ఇన్ఛార్జ్ డాక్టర్ పి. నీరజ విద్యార్థులకు సర్టిఫికెట్ అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర రీసెర్చ్ అసిస్టెంట్ డాక్టర్ఏం. ఇందిరా, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి అధికారంలోకొస్తేనే అందరికీ న్యాయం: భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : టిడిపి అధికారంలోకి వస్తేనే పేద బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని నగరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక పుత్తూరు మున్సిపాలిటీ 11వ వార్డు, విద్యానగర్ కాలనీ బజల వారి కండ్రిగ వీరపురెడ్డి పాల్యం, ఆది ఆంధ్ర వాడ సిటిజెన్ నేత సాయి నగర్ వాసవి నగర్ లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ లో భాగంగా ఇంటింటికి వెళ్లి బాబు సూపర్ సిక్స్ కరపత్రాలు అందిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్ ఎన్ ధనపాల్, చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, రాష్ట్ర తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ డీజీ ధనపాల్, చిత్తూరు పార్లమెంటరీ తెలుగు యువత ప్రతినిధి చినబాబు, బి గాంధీ నాయుడు ఎస్ పురుషోత్తం బి గోవర్దన్, బాబు నాయుడు, ఏ ఆనంద్, శేఖర్ నాయుడు, శ్రీనివాస నాయుడు, వినయ్ బాబు, ప్రసాద్ బాబూరావు పాల్గొన్నారు.

తొమ్మిది మంది విజయం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ ఎంప్లాయిస్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు గత నెల 28 తేదీన జరిగాయి. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయి తొమ్మిది మంది అభ్యర్థులు గెలుపొందారు. ఈ ఎన్నికలలో గెలిచిన 9 మంది అభ్యర్థులలో ఉపాధ్యక్షులుగా బి.టీలా కృష్ణ రెడ్డి, కార్యదర్శిగా ఎస్. గిరీష్ కుమార్, కోశాధికారిగా ఎన్.అరుణ్ కుమార్, సహాయ కార్యదర్శిగా, యస్ఏ మస్తాన్ భాషా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి యనమల లోకనాథం వెల్లడించారు. మిగిలిన సభ్యులుగా యం.వి ఉమా మహేష్, ఎ.ఆది నారాయణ, బి.రమేష్ బాబు, జి.నాగరాజు డైరెక్టర్లు గా కొనసాగనున్నట్లు తెలిపారు. వీరి పదవీ కాలం ఐదు సంవత్సరాలు ఉంటుందని, ఇది తక్షణమే అమలులోకి వచ్చినట్లు ఎన్నికల అధికారి యనమల లోకనాథం ప్రకటించారు. ఈ సందర్భంగా అభినందనలు బోధన, బోధనేతర సిబ్బంది, వివిధ విభాగ సంఘాల నేతలు, పరిశోధకులు, విద్యార్థులు, అకడమిక్ కన్సల్టెంట్లు శుభాకాంక్షలు తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: జడ్జి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పిల్లలు మాదకద్రవ్య అలవాట్లు, మాదక ద్రవ్య రవాణా, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్ రాఘవేంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక గేటు పుత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని, విలువైన జీవితాలు ఛిద్రమవుతున్నాయన్నారు. పీటీ వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చి అనారోగ్యం పాలు కాకుండా పిల్లలు ఇంట్లోనే ఉండి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. హోటల్లో ఫాస్ట్ ఫుడ్లను అనారోగ్యకరమైన స్వీట్ సాల్ట్ ఉపయోగించడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, కల్తీ ఆహారాన్ని నిరోధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలసుబ్రమణ్యం, ఎస్ఐ వెంకట మోహన్, పాఠశాల ఉపాధ్యాయులు వేమలు, పీటీ మాస్టర్ జయదేవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించండి

- ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ - ఈకేవైసీ సత్వరమే పూర్తి చేయాలి - అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నేడు ఆదివారం నిర్వహించనున్న పోలియో చుక్కలు వేయించాలని, నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పెండింగ్ ఉన్న వాటిని రానున్న మంగళవారం లోపు తప్పక పూర్తి చేయాలనీ, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఈ – కేవైసీ సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టరు జి లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, తహాశీల్దారులతో కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పల్స్ పోలియో , నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ జాతీయ ఇమ్యునైజేషన్ దినం పురస్కరించుకొని 0–5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని, ఉదయం 6 నుండే బూత్ స్థాయిలో పోలియో చుక్కల కార్యక్రమం ప్రారంభం కావాలని, 0–5 సంవత్సరం లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పోలియో చుక్కలు వేసుకోని మిగిలిన పిల్లలకు 4,5 తేదీలలో ఇంటింటికి వెళ్లి వేయాలన్నారు. ఇప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు విధిగా ఈ పోలియో చుక్కలు వేయించాలని, తద్వారా పోలియో లేని సమాజ స్థాపనే లక్ష్యమనీ అన్నారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పెండింగ్, వాటిని రానున్న మంగళవారం లోపు తప్పక పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టరు శ్రీనివాస రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టరు శ్రీహరి, డిపిఎంఓ శ్రీనివాసరావు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టరు రాజ శేఖర్ రెడ్డి, గ్రామ వార్డు సచివాలయం అధికారి సుశీల దేవి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


పరీక్షా సామగ్రితో పదవ తరగతి విద్యార్థులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని కల్లివేటి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్ పేర్కొన్నారు. మండలంలోని కల్లివేటి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు శనివారం ఉదయం సరస్వతి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు రూపేష్ మాట్లాడుతూ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే పదవ తరగతి పాఠశాల దశ కీలకమైందని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చునని పేర్కొన్నారు.పదవ తరగతి విద్యార్థులకు సరస్వతి పూజతో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి సూచనలు, పదవ తరగతి తర్వాత ఏ కోర్సులో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందో ఆ కోర్సును, వారివారికి ఇష్టమైన రంగంలో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్ బాబు, నాదెండ్ల మురళి, ఒబ్బు ప్రసాద్, వేణుగోపాల్, దేవేంద్ర,దాసు, లక్ష్మయ్య, జగన్నాధం, మాధవీలత పాల్గొన్నారు.

విజల్నాయుడుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి: సిపిఎం

ప్రజాశక్తి -బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం కుక్కంబాకం దళితులపై విచక్షణారహితంగా దాడి చేసిన విజల్ నాయు డుపై ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయా లని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, సత్యవేడు నియోజక వర్గ ఇన్ఛార్జి దాసరి జనార్ధన్, మండల కార్యదర్శి నలుగురి రమణయ్య డిమాండ్ చేశారు. దళితులు కుక్కం బాకం రెవెన్యూలోని సర్వేనెంబర్ 81 లో ఉన్న 82 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటుండగా స్థానికేతరుడు, అగ్రకులస్తుడైన తిరుపతికి చెందిన విజిల్ నాయుడు ఈ భూమిపై కన్నేసి కబ్జాకు యత్నించాడని అడ్డుకున్న దళితులపై విచక్షణా రహితంగా తన బెల్ట్తో మహిళలని కూడా చూడకుండా తరిమి తరిమి కొడుతూ భయో త్పాతం సృష్టించాడని, ఆయనపై ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వారు స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయ కులు మాట్లాడుతూ తక్షణమే పోలీసులు జోక్యం చేసుకుని బాధితులకు రక్షణ కల్పించి, స్థానికేతరులు, భూ కబ్జా దారు లపై ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసు కోవాలని కారారు. ఈ కార్యక్రమంలో జెకె రమణయ్య కుక్కంబాకం దళితు లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తొలగించిన క్షురకులను విధుల్లోకి తీసుకోవాలి

కందారపు మురళికి యానాదయ్య క్షమాపణ చెప్పాలి: రాధాదేవి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల కళ్యాణకట్టలో తొమ్మిది మంది క్షురకులను వేంటనే విధుల్లోకి తీసుకోవాలని, అలా విధుల్లోకి తీసుకోని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తలనీలాల కేంద్రాల్లో కత్తి డౌన్ పాటించేలా ఉద్యమిస్తామని మహిళా క్షురకుల సంఘం వ్యవస్థాకురాలు రాధాదేవి స్పష్టం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి నేతృత్వంలోని బోర్డు నిర్ణయం తీసుకుంటే ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. హామీని అమలు పరచాల్సిన భాధ్యత టిటిడి ఈవోపై ఉందని, వెంటనే అధికారులు స్పందించి తొలగించిన శ్రీహరి, ప్రసాద్తో సహా మిగిలిన వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. టిటిడిలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులకు కల్పించే సౌకర్యాలను పీస్రేట్ క్షురకులకు వర్తింప చేయాలన్నారు. రానున్న 10


మాట్లాడుతున్న మహిళా క్షురకుల సంఘం వ్యవస్థాకురాలు రాధాదేవి

తేదిలోపు తొలగించిన వారిని తిరిగి విదుల్లోకి తీసుకోక పోతే 13వ తేదీ రాష్ట్రంలో ఉన్న అన్ని నాయీబ్రాహ్మణ కులసంఘాల మద్దతుతో, రాజకీయ పార్టీల మద్దతుతో పెద్ద ఎత్తున టిటిడి పరిపాలన భవనం వద్ద ధర్నా చేస్తామన్నారు. నిరంతరం నిరుపేదల పక్షాన నిలబడి అనేక పోరాటాలు చేసి, కార్మికులకు అండగా ఉన్న సిఐటియు నాయకులు కందారపు మురళీ, టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్య చేసిన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని కోరారు.

ప్రారంభ భవనాలనే మళ్లీ మంత్రి ప్రారంభించారు: మురళీధర్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత నెల 25వ తేదీన అప్పలాయగుంట సచివాలయం, పత్తి పుత్తూరులో పాలసీతలీకరణ కేంద్రం, రైతు భరోసా కేంద్రాలను జిల్లా పరిషత్ సభ్యుడి హోదాలో తాను ప్రారంభిస్తే మళ్లీ అదే భవనాలను శనివారం మంత్రి రోజా ప్రారంభించారని వడమాల పేట జెడ్పిటిసి మురళీధర్ రెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25వ తేదీ భవనాలను ప్రారంభిస్తే, 27వ తేదీ పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రారంభించిన భవనాల శిలాఫలకాలను ఎత్తుకెళ్లిపోయారని ఇదివరకే మీడియా ముందు ఆవేదనను తెలుపుకున్నారన్నారు. నగరి నియోజవర్గ పరిధిలోని ఐదు మండలాల ప్రజలు మంత్రి రోజా అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారని, వైసీపీకి కట్టుబడి ఉన్న తమను మంత్రి రోజా వేధిస్తున్నారని, దీనిపై ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో భాస్కర్ రెడ్డి, పరంధామ యాదవ్, వాసుదేవరెడ్డి, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

శ్రీరామ కళాశాలకు నాక్- ఏ గ్రేడ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి–కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు, వసతులను కల్పించడం పట్ల నాక్ సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేస్తూ కళాశాలకు నాక్–ఏ గ్రేడ్ ను ప్రకటించారని కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిష్టాత్మకమైన గుర్తింపు కళాశాలకు రావడంతో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జయచంద్ర సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జయచంద్ర మాట్లాడుతూ గత నెల ఫిబ్రవరి 22, 23వ తేదీలలో జాతీయ అంచనా, అక్రిడిటేషన్ సిబ్బంది శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు కల్పించే సదుపాయాలను, వనరులను, పరిశోధన కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. అరవింద్ కుమార్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ శ్రీరామ కళాశాలలో ఉత్తమ విద్య బోధనతో విద్యార్థుల లక్ష్యాలను చేరుకునేలా అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సమిష్టి కృషి ఫలితమే ఈ గుర్తింపు అన్నారు. ఈ సందర్భంగా ఈ విజయానికి తోడ్పడిన కళాశాల సిబ్బందికి, అలుమిని విద్యార్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లలు శోధించే తత్వం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: శోధించే తత్వాన్ని పిల్లలు అలవర్చుకోవాలని ఎంఈఓ గున్నయ్య పేర్కొన్నారు. శనివారం విజ్ఞాన జ్యోతి ఇంగ్లీష్ మీడియం హైస్కూలులో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు ఇతర విషయాలపై శోధించి పరిశోధించి క్షుణ్ణంగా అర్థం చేసుకునే లక్షణం విద్యార్థి స్థాయి నుండే ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని అప్పుడే ప్రతి విషయాన్ని సూక్ష్మ దృష్టితో అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు నైపుణ్యతను పెంపొందించడానికి ఈ సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగపడుతుందని ఇటువంటి కార్యక్రమాలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యతను పెంపొందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ దామోదర్ రెడ్డిని, ప్రిన్సిపల్ రామ్మోహన్ ను ఆయన అభినందించారు. విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల వస్తువులను ఆయన పరిశీలించారు. రైతులకు ఉపయోగపడే విధంగా ధాన్యాలను రక్షించుకోవడానికి ఏర్పాటు చేసిన పరిశోధన అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పద్మప్రియ, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

చేతక్ ఎక్స్ క్లూజివ్ షోరూంను ప్రారంభించిన మేయర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతిలో శనివారం విడుదల చేసిన సరికొత్త ప్రీమియం స్కూటర్లు తిరుపతి రేణిగుంట రోడ్ లోని శ్రీరామ్ చేతక్ షోరూమ్ను తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష చేతుల మీదుగా సరికొత్త ప్రత్యేకమైన ఎలక్ట్రిక్ షోరూమ్నుశనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ బజాజ్ చేతక్ వాహనం తాము 30 సంవత్సరాల నుంచి తన తండ్రి వినియోగిస్తున్నారన్నారు. శ్రీ రామ్ బజాజ్ మేనేజింగ్ పార్టనర్ శ్రీనివాస రావు మాట్లాడుతూ అదిరిపోయే ఫీచర్లతో బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ చేతక్ ప్రీమియం– 2024 సహా చేతక్ అర్బన్– 2024 వేరియంట్లలో ఇది వచ్చిందన్నారు. చేతక్ అర్బన్ ధర రూ. 1,15,002 కాగా, చేతక్ ప్రీమియం ధర రూ.1,35,463 గా ఉందని తెలిపారు. హ్యాజిల్నట్, ఇండిగో మెటాలిక్ బ్లూ, బ్రూక్లిన్ బ్లాక్ కలర్స్లో ఈ కొత్త స్కూటర్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. మరిన్ని అధునాతన ఫీచర్లు జోడించి చేతక్ ప్రీమియం, అర్బన్ 2024 మోడల్ స్కూటర్లు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. శ్రీ రామ్ బజాజ్ మేనేజింగ్ పార్టనర్ సాకేత్ రామ్ మాట్లాడుతూ దీంట్లో అమర్చిన 3.2 కిలో వాట్ బ్యాటరీ ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 127 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని కంపెనీ తెలిపిందన్నారు. దీంట్లో ఎన్నో అద్భుతమైన ఫీచర్లు ఉన్నాయని బజాజ్ కొత్త చేతక్ గరిష్ట వేగం గంటకు 73 కిలోమీటర్లు వుందని, బ్లూటూత్ సహా యాప్ అనుసంధానిత, నోటిఫికేషన్ అలర్ట్, వివిడ్ టిఎఫ్టి, డిస్ప్లే, టిబిటి నావిగేషన్ సపోర్ట్, కాల్ మేనేజ్ మెంట్, మ్యూజిక్ కంట్రోల్ వంటి సదుపాయాలు ఈ స్కూటర్లలో ఉన్నాయి.


షోరూంను ప్రారంభిస్తున్న మేయర్ శిరీష

శ్రీ కృష్ణ కాంత్ షడంగికి ఉత్తమ పురస్కారం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): తిరుపతి కేంద్రీయ విశ్వవిద్యాలయం తొమ్మిదవ తరగతి విద్యార్థి శ్రీకృష్ణకాంత్ షడంగికి భారత సంస్కృతి సమ్మాన్, ఉత్తమ వేద విద్యార్థి పురస్కారం అభించింది. డాక్టర్ గిరిజా ప్రసాద్ షడంగి, మీనాక్షి షడంగిల పుత్రుడైన శ్రీకృష్ణకాంత్ షడంగి చిన్ననాటి నుంచి వేద అధ్యయనం చేయాలన్న ఆసక్తితో తండ్రి బాటను అనుసరిస్తున్నాడు. చిన్ననాటి నుంచి వేదాధ్యయనం చేస్తూ సామవేదం అధ్యయనంచేస్తూ తండ్రి వద్ద శుక్ల యజుర్వేద అధ్యయనం, రమేష్ ఆధ్వర్యంలో శుక్ల యజుర్వేద కాణ్వ శాఖ అధ్యయనం చేసి రాయలసీమ పరీక్షల్లోనూ ప్రథమ శ్రేణి విద్యార్థిగా ఉత్తీర్ణత పొందారు. ఇతని ప్రతిభను చూసి సత్యసాయి మా అభ్యు దయ విశ్వవిద్యాలయం, భారత అభ్యుదయన కేంద్రం కాశీ విశ్వవిద్యాలయం నుండి ఉత్తమ వేద విద్యార్థిగా నేషనల్ అవార్డును హిందూ యూనివర్సిటీ విసి సుధీర్ జైన్ నుంచి, సత్యసాయి అభ్యుదయ విశ్వవిద్యాలయం తరఫున కాశీ విశ్వవిద్యా లయం బనారస్లో ఉత్తమ వేద విద్యార్థిగా పురస్కారం అందుకున్నారు. స్వర్ణ పతకం, గోల్డ్ మెడల్ను, రెండు లక్షల నగదు బహుమతితో అత్యుత్తమ వేద విద్యార్థిగా సన్మానం చేశారు. అతని ఉజ్వల భవిష్యత్తులో ఇంకా ఎన్నో అవార్డులు, సర్టిఫికెట్లు అందుకోవాలని ప్రశంసించారు.


ఉత్తమ పురస్కారం అందుకుంటున్న శ్రీకృష్ణకాంత్ షడంగి

చెరువును చెత్తతో నింపుతున్నారు!

చెత్తతో చేపలకు ప్రమాదం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం రవాణాశాఖ కూడలి నుండి శెట్టిపల్లి గ్రామ మార్గాన్ని కలుపుతూ నిర్మిస్తున్న 80 అడుగుల రోడ్డు పనులలో భాగంగా రోడ్డును రెండు వైపులా వెడల్పు చేయడానికి ఇదే మార్గంలోని శెట్టిపల్లి చెరువును చెత్తతో 40 అడుగుల మేర నింపేశారు. ఇటుగా ఈ పనులు చూసిన వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు భౌగోళిక స్వరూపాన్ని గుత్తేదారు మార్చేస్తూ వ్యర్థాల వల్ల చెరువులో చేపలకు ప్రాణ సంకటం ఏర్పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేళ్లకు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి చొరవతో మంగళం–శెట్టిపల్లి మార్గానికి 'మహర్దశ ' వచ్చిందనుకుంటే పనులలో నాణ్యత దారుణంగా ఉండడంతో ఇటుగా ప్రయాణాలు సాగించే వాహన దారులు పెదవి విరుస్తున్నారు.

కొన్నేళ్లుగా ఈ మార్గంలో....

కొన్నేళ్లుగా మంగళం–శెట్టిపల్లి మార్గంలో గృహ నిర్మాణ వ్యర్థాలను తోలుకుంటూ తిరిగి లోతైన ప్రాంతాలను పూడ్చుకోవడానికి మళ్లీ తీసుకెళుతుంటారు. కాగా శెట్టిపల్లి గ్రామ సమీపంలో సమీప ఫ్యాక్టరీల నుండి వ్యర్థాలను తీసుకొచ్చి ఇక్కడ పోశారు. వాటిని గుత్తేదారుకు సంబంధించిన ప్రొక్లైనర్, టిప్పర్తో లోడ్ చేసుకుని శెట్టిపల్లి చెరువు వద్ద పోసి మళ్లీ అదే యంత్రంతో ఆ గుట్టల చెత్తను చెరువులోకి పోసేశారు. ఇప్పటికే దాదాపు 40 నుంచి 50 అడుగుల మేర చెరువు భాగం చెత్త వ్యర్థాలతో నిండిపోయింది. టిటిడి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ రోడ్డు పనులపై అధికారుల పర్యవేక్షణ లేనట్టుగా స్పష్టంగా తెలుస్తోంది. ఏ క్లాస్ కాంట్రాక్టర్లచే పనులు చేయించుకునే టిటిడి ఇంత జరుగుతున్నా ఏమీ పట్టనట్టుగా వ్యవహరించడం విస్మయానికి గురిచేస్తోంది. దీనిపై చెరువు గుత్తేదారుగా వ్యవహరిస్తున్న వ్యక్తికి ఫోన్ చేసినా స్పందించలేదు.

క్రైం న్యూస్

బస్సు, లారీ ఢీ

-30 మందికి తీవ్ర గాయాలు

- ముగ్గురి పరిస్థితి విషమం


చికిత్స పొందుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి, పెళ్లకూరు: బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో 30 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చవటకండ్రిగ సమీపంలో నాయుడుపేట–మదనపల్లి జాతీయ రహదారిపై ఈ ప్రమాదం శనివారం చోటు చేసుకుంది. పెళ్లకూరు పోలీసుల కథనం మేరకు..పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు నుంచి తిరుపతికి 40 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు బయలు దేరింది. ఈ క్రమంలో పెళ్లకూరు మండలం చవటకండ్రిగ సమీపంలో తిరుపతి నుంచి నెల్లూరు వైపు వెళుతున్న లారీ ఎదురుగా ఢీకొంది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 30 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. మరో 10 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రులనంతా 108 సాయంతో చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. పెళ్ళకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ జిగ్ జాగ్ గా లారీని నడపడంతో ప్రమాదం జరిగిందనీ, బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారని కండక్టర్ తెలిపారు.

స్కూటీ బోల్తా..ఒకరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - బాలాయపల్లి : వెంకటగిరి – గూడూరు రోడ్డు మార్గం బాలాయ పల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సమీపం వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద శనివారం స్కూటీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో వల్లూరు.సుమిత్రి (65)కు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది కథనం మేరకు.. నెల్లూరు నుంచి వెంకటగిరి కి బంధువులు ఇంటికి వల్లూరు కోదండరామయ్య, భార్య సుమిత్రలు స్కూటీలో బయలుదేరి వెళుతూ మార్గ మధ్యంలో మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్తు ఉన్నత ఉన్నత పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్ ఉండడంతో అదుపుతప్పి బోల్తా పడటంతో సుమిత్రమ్మ తలకు తీవ్ర మైన గాయాలయ్యాయి. దీంతో స్పృహ కోల్పోయింది. స్కూటీ నడుపుతున్న కోదండరామయ్య ఎటువంటి గాయాలు కాలేదు. గాయపడిన వారిని 108 లో గూడూరు ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

లారీలు ఢీ.. ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - ఓజిలి : రెండు లారీలు ఒకదాని వెనక మరొకటి ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఓజిలి ఎస్ఐ పి రవిబాబు కథనం మేరకు మండల పరిధిలోని పెద్దపరియ జాతీయ రహదారి కూడలి వద్ద శనివారం తెల్లవారుజామున చెన్నై నుండి ఒంగోలు వైపు వెళ్తున్న చెన్నై రిజిస్ట్రేషన్ కంటైనర్ లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనకే వస్తున్న ఆంధ్ర రిజిస్ట్రేషన్ లారీ వెనక నుండి ఢీకొంది. ఈ సంఘటనలో డ్రైవర్ సూరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆంధ్ర రిజిస్ట్రేషన్ లారీ యజమాని ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించలేదని యువతిపై కత్తితో దాడి

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి ఆర్ ఎఫ్ రోడ్ లో ఓ సైకో రెచ్చిపోయాడు. ప్రేమించలేదనే కారణంతో స్రవంతి అనే యువతిపై విచక్షణా రహితంగా మహేష్ అనే యువకుడు దాడి చేసిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. స్రవంతి చెన్నైలోని ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్నట్టు సమాచారం. తల్లిదండ్రులను కోల్పోయి, అమ్మమ్మ సంరక్షణలో ఉంటున్న స్రవంతి పై మహేష్ కన్నేసిన ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. నిద్రిస్తున్న స్రవంతిపై కత్తితో దాడి చేయటంతో తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలతో స్రవంతిని రుయా ఆస్పత్రికు తరలించారు. మహేష్ ను పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నారు.

కోట పట్టణ అభివృద్ధే లక్ష్యం: వినోద్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి -కోట : కోట పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వర్తించడమే తమ లక్ష్యమని రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన కోట పట్టణంలో చేస్తున్న పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. రామ్ రాజ్ హాల్ ఎదురుగా చేపట్టబోతున్న సిసి రోడ్డు, నూతనంగా విద్యుత్తు స్తంభాల నిర్మాణాల స్థితిగతులను సంబంధిత వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ కోట పట్టణంలో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య లోపాలు లేకుండా చెత్త చెదారాన్ని తొలిగించి, డ్రైనేజీల పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నారు. పలు వీధుల్లో ప్రజలు నడవడానికి కష్టంగా ఉన్న పలుచోట్ల గ్రావెల్తో రోడ్డును అమర్చడమే కాకుండా సీసీ రోడ్లను నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అద్దాల శివకుమార్, కోట విద్యుత్ శాఖ ఏఈ నారాయణరెడ్డి, కాంట్రాక్టర్ దువ్వూరు రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

వేమిరెడ్డి తోనే నా ప్రయాణం

- కనుమూరు హరిచంద్ర రెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సేవ చేయడంలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తోనే తమ పయనమని అందుకే వైసిపికి రాజీనామా చేసి టిడిపిలోకి వెళుతున్నామని గూడూరు పట్టణానికి చెందిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరు హరిచంద్ర రెడ్డి పేర్కొన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని తూర్పు వీధిలో ఉన్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి కనుమూరు హరిచంద్ర రెడ్డి నివాసానికి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, టీడీపి నాయకులు విచ్చేసి మర్యాద పూర్వకంగా కలిశారు. టిడిపిలోకి వస్తున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరిచంద్ర రెడ్డి మాట్లాడుతూ సోదరులతో సమానమైన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి నడుస్తామని రాబోయే ఎన్నికలు అహంకారానికి అభిమానానికి మధ్య జరుగుతున్నాయని అందరం టిడిపి విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు ,శివకుమార్, ప్రణీత్ యాదవ్ పాల్గొన్నారు.

ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ద్రౌపది సమేత ధర్మరాజు స్వామి దేవస్థాన నూతన కమిటీ సభ్యులచే ఈవో నవీన్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి దేవస్థానానికి దేవాదాయశాఖ అధికారులు నూతన పాలక మండలి సభ్యులను నియమించారు. సభ్యులచే ఈవో నవీన్ కుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. ముందు సభ్యులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తొమ్మిది మందిని పాలకమండలి సభ్యులుగా నియ మించారని వీరిలో బొమ్మిడి శ్రీనివాసులను పాలక మండలి అధ్యక్షులుగా ఎన్నుకున్నారని తెలిపారు.

కృష్ణమాచారికి టిడిపి నాయకుల నివాళి


కృష్ణమాచారికి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని అనుపల్లి గ్రామానికి చెందిన తాండాయం కృష్ణమాచారి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. శనివారం ఉదయం మండల టిడిపి అధ్యక్షుడు మేకల తిరుమల్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు చేకూరి జనార్ధన్ చౌదరీ ఆయన మృతదేహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి కుటుంబానికి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి బిందు మాధవి, టిడిపి యువ నాయకుడు బండి విజయ్ కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఎన్ రత్నం నాయుడు, రాంపురి అల్లేయ్య ఎద్దుల రాకేష్ రెడ్డి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: పాకాల మండలం లోని వల్లివేడు పంచాయతీలోని చంద్రగిరి వారిపల్లి, ఎస్టీ కాలనీ, తురకపల్లి, వల్లివేడు, హరిజనవాడలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మిరెడ్డితో కలిసి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ విక్రమ్ రెడ్డి, జెడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి, సర్పంచ్ ప్రత్యూష్ రెడ్డి, స్థానిక నాయకుల ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ లోకనాథం, బీసీ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ మబ్బు నేని రఘుపతి, వైసీపీ మొగరాల డివిజన్ అధ్యక్షుడు మొగరాల హరిప్రసాద్ రెడ్డి, మండల కన్వీనర్ నరేష్ రెడ్డి, పాల్గొన్నారు.